
నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం 11 ఏప్రిల్ 2023



మల్లన్న సాగర్ ఓ అద్భుతం

నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమం కోసం నిర్మించిన మల్లన్న సాగర్ జలాశయం అద్భుతంగా ఉన్నదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, నాచారం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి అన్నారు. సోమవారం మల్లన్న సాగర్ జలాశయం ట్రయల్ రన్‌కు వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత వారు మాట్లాడారు. 70 సంవత్సరాలు పరిపాలించిన ప్రభుత్వాలు తెలంగాణలో మల్లన్న సాగర్ జలాశయం లాంటి ప్రాజెక్టులు నిర్మించలేదన్నారు. కనీసం నిర్మాణానికి రాయి కూడా వేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో కొండపోచమ్మ జలాశయం, మల్లన్న సాగర్ జలాశయం నిర్మించి రైతులకు మూడు పంటలకు నీరు అందిస్తున్నారన్నారు. గజ్వేల్ నియోజకవర్గం రైతులకు ఆ ప్రాజెక్టు వరంగా మారినట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్యాణ్ కార్ శ్రీనివాస్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



నవతెలంగాణ-మెదక్‌డెస్క్

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు పాలనాధికారి ముజామిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీదారుల నుంచి అదనపు పాలనాధికారి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడ తూ.. జిల్లా నలుమూలల నుంచి తమ సమ స్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జీదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యం అన్నారు. అర్జీదారుల నుండి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పింఛన్లు మరియు ఇతరత్రా మొత్తం కలపి 65 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ లక్ష్మి కిరణ్, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హెూం మంత్రి మహమ్మద్ అలీకి ఇఫ్తార్ విందు ఆహ్వానం

నవతెలంగాణ-పటాన్‌చెరు

రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఈనెల రేపు(బుధవారం) సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గస్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ విందుకు ఏర్పాటు చేశారు. ఈ విందుకు హాజరుకావాలని కోరుతూ రాష్ట్ర హెూం శాఖ మంత్రి మహమ్మద్ అలీకి పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు.



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దాచారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గుండారం రాజయ్య, ఉప సర్పంచ్ దివ్య నాగారాజు దంపతులు,పెద్దల రాజు, మ్యాకల ఐలయ్య, అట్ల సంపత్,కుసుంబ రాజేశం,మ్యాకల రాజశేఖర్ సోమవారం కనగండ్ల తిరుపతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా పార్టీ కోసం పనిచేసే నాయకులను, కార్యకర్తలను విస్మరించి వ్యక్తుల కోసం పాటుపడే విధంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరించే తీరుతో మండల కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నమవుతోందని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.



ఇసుక లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ కార్మికులకి కూలి రేట్లు పెంచాలి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

ఇసుక లోడింగ్ అండ్ అన్ లోడింగ్ కార్మికులకి కూలీ రేట్ పెంచాలని.. ఇసుక లోడింగ్ అన్‌లోడ్‌కి వాడుతున్న జేసీబీ మిషన్లను వెంటనే బంద్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని నరసాపూర్ చౌరస్తాలో ఇసుక లోడింగ్ అండ్ అన్ లోడింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్మికులకు మూడేండ్ల క్రితం టన్నుకు అరవై రూపాయల చొప్పున కూలి ఉండాలని నిర్ణయించారని.. కానీ పెరుగుతున్న నిత్యవసరకులతో పోలిస్తే ఈ కూలి వారికి సరిపోదన్నారు. అలాగే వారి పనులకు వాటకం కలిగించే విధంగా కొంతమంది యజమానులు జెసీబీ మిషన్లు తెచ్చి ఇసుక లోడింగ్ అన్లోడింగ్ చేస్తున్నారని.. దీంతో వారి ఉపాధికే నష్టం వాటిల్లితున్నదన్నారు. ఇప్పటికైనా ఇసుక వ్యాపారులు స్పందించి.. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్లయ్య, వెంకన్న, చంద్రకళ, సుజాత, లక్ష్మి, కనకయ్య, నరసింహులు, చిరంజీవి, రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.



టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ దోషులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-జోగిపేట

టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ దోషులను కఠినంగా శిక్షించాలని వైయస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతి నిధి బి. సంజీవరావు అన్నారు. సోమవారం సాయంత్రం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జోగిపేట తహసిల్దార్ కార్యాలయంలో ఉప తహసిల్దార్ మధుకర్ రెడ్డికి అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్పీ ఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలనిడిమాండ్ చేశారు. పరీక్షల ను తిరిగి నిర్వహించా లన్నారు. సిఎఫ్ బిస్వాల్ కమిటీ ప్రకారం వెంటనే 1.91 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రిలీజ్ చేయాలన్నారు. నిరుద్యోగులకు రూ.3016 నిరుద్యోగ పెన్షన్ ఇవ్వాలన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు చెల్లించాలన్నారు. విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ల వెంటనే విడుదల చేయా లన్నా రు. యూనివర్సిటీ కాలేజీలు స్కూల్స్ లలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాల న్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టిపి పట్టణ అధ్యక్షులు ఆరిగి రాకేష్, నాయకులు శ్రీహరి, సంగన్న, ఉదయ్, వెంకటేశం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి హామీ కూలి మృతి



నవతెలంగాణ-మెదక్‌డెస్క్

ఉపాధి హామీ పనులు చేస్తూ గుండెపోటుతో కుప్పకూలి వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం దేవులపల్లిలో సోమవారం జరిగింది. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి నాగరాజు (38) రోజు మాదిరిగానే సోమవారం ఉపాధి పనులకు వెళ్లి ఒక్కసారిగా కింద పడిపోయాడు. వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్‌ను పనుల వద్దకు పిలి పించారు. డాక్టర్ వచ్చి బిపి చెక్ చేసి సీపీఆర్ చేయగా ఫలితం లేకుండా పోయి ంది. అక్కడి నుంచి నాగరాజును ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు స్పందించకపోవడంతో కొద్దిసేపు ఆస్పత్రిలోనే ఉండి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకె ళ్లారు. అక్కడ వైద్యులు చూసి గుండెపోటుతో మృతి చెందాడని నిర్ధారించారు. దీం తో కుటుంబ సభ్యుల రోదనలు ఆస్పత్రిలో పలువురిని కంటతడి పెట్టించాయి. మృతునికి భార్య విజయ, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగరాజు కూలీ పని చేస్తూ, ఆటో నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ పెద్దదిక్కు మృతితో బంధువులు, గ్రామస్తుల రోదనలు ఆస్పత్రిలో అందరిని కంటతడి పెట్టించాయి.

ఫీజులన్నీ చెల్లించాం..

పరీక్షలు రాయలేకపోతున్నాం

మాకు న్యాయం చేయండి : ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ఆవేదన

- ప్రిన్సిపల్ ఇందిరమ్మది ఆదినుంచి వింత వైఖరే..
- నాడు గురు బసవ జూనియర్ కళాశాల.. నేడు ఆక్స్ఫర్డ్ హై స్కూల్
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

నవతెలంగాణ-జహీరాబాద్

ఆ పాఠశాల విద్యార్థులు ఇతర పాఠశాలల్లో లాగానే అన్ని ఫీజులు చెల్లించారు. నిత్యం పాఠశాలకు వెళ్లి.. పరీక్షలకు సిద్ధమ య్యారు. జీవితంలో తాము ఎంచుకున్న గమ్యానికి మొదటి అడుగైన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటాలని మార్గ నిర్దేశనం చేసుకున్నారు. కానీ పాఠశాల ప్రిన్సిపాల్ చేసిన దుర్మార్గంతో వారికి కనీసం హాల్ టికెట్లు కూడా రాలేదు. వారి స్నేహితులు పరీక్షలు రాస్తుంటే.. వారు మాత్రం ఇంట్లోనే కూర్చోవాల్సిన దుస్థి తి ఎదురైంది. మా నుంచి అందరిలాగానే ఫీజులు వసూలు చేశా రు.. మమ్మల్ని కూడా పరీక్షలు రాయనీయండి అంటూ జహీరా బాద్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ ఇందిరమ్మది ఆది నుంచే వింత వైఖరి..

ఈ పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరమ్మ నాడు గురు బసవ జూనియర్ కళాశాలతోనూ.. నేడు ఆక్స్‌ఫర్డ్ పాఠశాల పేరుతో విద్యార్థులతో జీవితం చెలగాటం ఆడిందని పలువురు ఆరోపిస్తున్నారు. నాడు గురు బసవ జూనియర్ కళాశాల స్థాపించి విద్యార్థుల ఫీజులు బోర్డుకు చెల్లించకపోవడంతో.. నాడు కూడా విద్యార్థులు హాల్ టికెట్ల కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ఇంటర్ బోర్డు అధికారులు గురు బసవ జూనియర్ కళాశాలను సందర్శించి.. కళాశాలకు ఎలాంటి అనుమతులు లేవని.. అందులో విద్యార్థులను చేర్పించకూడదని విలేకరుల సమావేశం పెట్టి చెప్పినట్టు గుర్తు చేశారు. అయినప్పటికీ ఇందిరమ్మ తనకు ఉన్న రాజకీయ అండతో అధికారులను సైతం బోల్తా కొట్టించి.. కళాశాల కొనసాగించారన్నారు. ప్రధానోపాధ్యాయులే ఎంఈఓలుగా కొనసాగుతుండడంతో వారు తమ పాఠశాలలో విద్యను బోధించట్లేదని.. ఇటు ఎంఈఓగా విధులు సక్రమంగా నిర్వహించటం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దీంతో పర్యవేక్షణ లోపించి.. కొన్ని పాఠశాలల్లో ఇలాంటి దుర దృష్టకర ఘటనలను చూడాల్సి వస్తున్నది. కాబట్టి ఈ ఘటనలో ఎంఈఓపై కూడా చర్య తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మాకు న్యాయం చేయండి : విద్యార్థులు

పరీక్షల ముందు ప్రిన్సిపల్ మేడం హాల్‌టికెట్ ఇస్తామని చెప్పింది. అందరూ పరీక్షలు రాస్తున్నా.. మాకు ఇంకా హాల్‌టికెట్‌లు ఇవ్వలేదు. టీచర్‌ని అడిగితే ప్రభుత్వం వల్ల ఇవ్వలేదని అంటున్నారు. స్కూల్ సమస్యో గవర్నమెంట్ సమస్యో మాకు తెలియదు. మా 8 మందికి హాల్‌టికెట్‌లు కావాలి. ఇప్పటి వరకు మాకు ఒక్క ఎగ్జామ్ రాయించలేదు.



దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. వారు మాకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మమ్మల్ని పరీక్షలకు అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

ప్రిన్సిపల్‌ను అరెస్టు చేసి విచారిస్తున్నాం..ఎస్ఐ శ్రీకాంత్

ఆక్స్‌ఫర్డ్ పాఠశాల యాజమాన్యం పదో తరగతి నిర్వహణకు అనుమతులు లేకుండా 8 మంది విద్యార్థులను అడ్మిషన్ చేసుకుంది. పరీక్ష ఫీజులు సహా పాఠశాల ఫీజులు సైతం దర్జాగా వసూలు చేసింది. వార్షిక పరీక్షలు ప్రారంభం కావస్తున్న రేపు మాపంటూ కాలయాపన చేస్తూ వచ్చింది. సగానికి పైగా పరీక్షలు పూర్తయినా ఇంకా హాల్‌టికెట్లు ఇవ్వక పోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా పాఠశాల ప్రిన్సిపల్ ఇందిరాపై కేసు నమోదు చేశాం. ఆమెను విచారించిన అనంతరం అరెస్ట్ చేశాం. కోర్టులో కూడా ప్రవేశపెట్టాం. ఇంకా ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నాం.



క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడలతో పాటు క్రీడాకారుల అభివృద్ధికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలో శంషాబాద్ నర్సింలు జ్ఞాపకార్థం స్థానిక కౌన్సిలర్ శంషాబాద్ రాజు ఏర్పాటు చేసిన కబడ్డీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వతహాగా క్రీడాకారుడైన ఎమ్మెల్యే జీఎంఆర్.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా ఉచిత శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల పటాన్చెరు పట్టణంలోని మైత్రి క్రీడ మైదానాన్ని ఏడు కోట్ల రూపాయలతో ఆధునికరించి సంవత్సరం పొడవునా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. యువత పెడదారి పట్టకుండా క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకి లక్ష అయిదు వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకి 65 వేల రూపాయలు, తృతీయ జట్టుకి 30 వేల రూపాయలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ రాములు గౌడ్, రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మెదక్‌డెస్క్

అనుమతి లేకుండా అడ్మిషన్స్ ప్రారంభించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అరవింద్ మాట్లాడుతూ.. ఎలాంటి పర్మిషన్ లేకుండా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం అడ్మిషన్స్ ప్రారంభించిందన్నారు. పట్టణంలో పెద్దపెద్ద హెూర్డింగ్స్ పెట్టి ప్రజలను, విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. పాంప్లెట్స్‌లో క్యూ ఆర్ కోడ్ ముద్రించి దాని ద్వారానే అడ్మిషన్లు తీసుకుంటున్నారన్నారు. స్కూలు స్థలాన్ని ఒక ప్రదేశంలో చూపించి, వేరొక ఒక స్థలంలో అడ్మిషన్స్ తీసుకుంటున్నారని.. ఇది సరికాదన్నారు. ఇప్పటివరకు ఎవరైతే అడ్మిషన్స్ తీసుకున్నారో వారి డబ్బులు రిఫండ్ చేయించాలన్నారు. సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి కర్రోల్ల నవీన్ నాయకులు రోహిత్, రాఘవ, మనిచరణ్ పాల్గొన్నారు.

ఇంటింటికి మంచి నీళ్లు ఇచ్చిన మొదటి రాష్ట్రం తెలంగాణ

- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- మిషన్ భగీరథ ట్రయల్ రన్ ప్రారంభం

నవతెలంగాణ-మెదక్‌డెస్క్

దేశంలోనే ఇంటింటికి మంచి నీళ్లు ఇచ్చిన మొదటి రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి మరియు ఆర్‌డబ్ల్యూఎస్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కుకునూర్‌పల్లి మండలం తిప్పారంలో ఏర్పాటు చేసిన మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ నుంచి మంగోల్ నీటి శుద్ధికరణ కేంద్రానికి రా వాటర్‌ను సరఫరా చేయు పంపుల ట్రయల్ రన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించి.. మోటార్లను స్టార్ట్ చేసి నీటిని వదిలారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రూ.1212 కోట్లతో తాగునీటి వసతి చేపట్టామని.. 1900 ఆవాసలకు, 9 నియోజకవర్గాలోని 16 మున్సిపాల్టీలకు ఈ ప్లాంట్ ద్వారా తాగునీరు అందనుం దన్నారు. మిషన్ భగీరథ దేశంలోనే తెలంగాణకు మకుటా యమానంగా నిలుస్తోందని.. ఈ విషయాన్ని కేంద్రమే పార్లమెంట్‌లో ఖితాబిచ్చిందన్నారు. మన పథకాలను చూసి కేంద్రం కాపీ కొడుతున్నదని.. వర్షపు నీళ్లను ఫిల్టర్ చేసి



ఇంటింటికి మనం నీళ్లు అందిస్తే, ఇతర రాష్ట్రాల్లో ఇచ్చేది బోర్ల నీళ్లే అన్నారు. మిషన్ భగీరథకు నిధులు ఇస్తామని కేంద్రం ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. మిషన్ భగీరథ చరిత్రలో ఈ రోజు సుస్థిరమయినదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశంలోనే ప్రతిరోజు 540 ఎంఎల్‌డి సామర్థ్యంతో నీటి విడుదల చేశామని, లేటెస్ట్ టెక్నాలజి, ఈక్విప్ మెంట్ వాడుతున్నామన్నారు. నేడు 50 శాతానికి ట్రయల్ రన్ చేపట్టామన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా ఏడు జిల్లాలు, 10 నియోజకవర్గాలోని 1922 గ్రామాలకు నీటి సరఫరా అవుతున్నదన్నారు. ఇప్పటి వరకు 300 మిలియన్ లీటర్లు సరఫరా అవుతుండగా, ఇప్పుడు మరో 300 మిలియన్ లీటర్ల నీటి సరఫరాకు అవకాశం ఏర్పడిందన్నారు. భవిష్యత్‌లో పెరిగే హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేశామన్నారు. భవిష్యత్ 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఈ పథకాన్ని రూపొందించామన్నారు. ప్రధాని మోడీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని.. సహకారాన్ని అందించనది మేము కాదు కేంద్రమే అని ఎద్దేవా చేశారు. మిషన్ భగిరతకు రూ.13 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ చెప్పినా.. రూ.13 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. మిషన్ భగీరథ వంటి ఉత్తమమైన కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణకు ఇంసెంటివ్‌లు ఇవ్వకుండా పక్షపాతం చూపడం లేదా అని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో 100 లీటర్లు ప్రతిరోజు ఇస్తే, హర్ గర్ జల్ పేరిట కాపీకొట్టిన కేంద్రం కేవలం 55 లిటర్లు మాత్రమే ఇస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి స్మిత సభర్వాల్ , జడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధ శర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డీసీసీబీ బ్యాంకు చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, ఎంపిపి ర్యాగల్ల సుగుణ దుర్గయ్య, వైస్ ఎంపిపి దేవి రవీందర్, ఎన్ ఈజీఎస్ స్టేట్ కోర్డినేటర్ కోల సద్గుణ రవీందర్, సర్పంచ్‌లు పులోజీ కిరణ్ కుమార్, బచ్చలి మహిపాల్, అమ్ములు రమేష్, అనంతుల ప్రశాంత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, అంబటి బాలచందర్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 49 అర్జీలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని.. ఈ వారం ప్రజావాణిలో 48 అర్జీలు వచ్చాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ శరత్, అధనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తంగా 49 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి (19) అర్జీలు రాగా, ఎస్సీ కార్పొరేషన్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పంచాయితీ, హౌసింగ్, మహిళా శిశు, వికలాంగుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, తదితర శాఖలకు సంబంధించి (30) దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఇచ్చి వెంటనే సమస్య పరిష్కరించాలని సూచించారు. తమ పరిధిలో పరిష్కరించదగినవి వెంటనే పరిష్కరిం చాలని, జాప్యం చేయరాదని సూచించారు.భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పించాలని, పింఛన్లు, స్వయం ఉపాధికి రుణం మంజూరు, ఔట్సోర్సింగ్ లో ఉద్యోగం కల్పిం చాలని, మూడు చక్రాల కుర్చీ ఇప్పించాలని, తదితర సమస్యలపై అర్జీలు అందాయి. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏఓ తదితరులు పాల్గొన్నారు.

నయన్ రాజ్‌ను కలిసిన కౌన్సిలర్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తనయుడు, బాచుపల్లిలోని మమత ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ పువ్వాడ నయన్ రాజ్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి సోమవారం జిన్నారం మండల నాయకులతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మమత ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నయన్ రాజ్‌కి వివరించారు. బొల్లారం పారిశ్రామిక వాడలో విస్తృత సేవలను అందించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా పేద ప్రజలకు ఆసుపత్రి ద్వారా అందిస్తున్న సేవ కార్యక్రమాలను మంత్రి తనయుడు నయనరాజ్ ని కొనియాడారు. ప్రతీ సంవత్సరం బొల్లారం మున్సిపాలిటీలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని నయన్ రాజ్ ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల మాదిరిగా ఇక్కడ కూడా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రి వైద్య బృందాన్ని చంద్రారెడ్డి అభినందించారు. మరిన్ని సేవలను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్యపల్లి సర్పంచ్ ప్రకాశం చారి, ఖాజీపల్లి సర్పంచ్ సత్యనారాయణ, నల్లవల్లి ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ గోపాలమ్మ, మమత ఆసుపత్రి పిఆర్ఓ అంజనేయులుగౌడ్ , స్థానిక నాయకులు వెంకటయ్య, రవితేజ, రాజు, ఆసుపత్రి వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-జోగిపేట

ఐకెపి వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఐకెపి వీవోఏల డివిజన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించా లన్నారు. సెర్ప్ నుండి ఐడి కార్డులు ఇవ్వాలనీ, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వివోఏల వ్యక్తిగత ఖాతాలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం వారితో వెట్టిచాకిరి చేయిస్తుంది తప్పా.. సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఆన్లైన్ పనులు చేయించొద్దవన్నారు. వీవోఏలపైన మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్ఎస్‌జిలకు వీఎల్ఆర్ అభయాసం డబ్బులు చెల్లించాలనీ, ఎస్ఎస్‌జి, వివోఏల లైవ్ మీటింగ్స్ రద్దు చేయాలన్నారు. అర్హులైన వివో ఏ లను



సీసీలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. కాగా ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు.

నూతన వీవోఏల డివిజన్ కమిటీ ఎన్నిక...

డివిజన్ అధ్యక్షులుగా లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులు నరేందర్ గౌడ్, స్వప్న, అనిత, కోశాధికారి కిష్టయ్య, సహాయ కార్యదర్శి విజయ, ధనలక్ష్మి, స్వప్న, సలహాదారుగా మల్లన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-మునిపల్లి

నేటితో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ పూర్తవుతున్నా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నీరుడి రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన మునిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నీరుడి రాజు మాట్లాడుతూ..నేటిలోపు వరకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించని పక్షంలో.. రేపట



నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వీరేశం, రాజ్‌కుమార్, సంతోష, సుమలత, శ్రీకాంత్, అనిల్, అ క్తర్, సరిత, నజీయా, సునీత, అనంత్, శ్రీకాంత్, రాము, రమేష్, లక్ష్మి, షాజాహన్ బేగం, మహేందర్ పాల్గొన్నారు.

పాలకుల విధానాలతో సామాజిక న్యాయానికి దెబ్బ

- అంబేద్కర్ పూలే, సందేశ్ యాత్రలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్

నవతెలంగాణ-సదాశివపేట

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలతో సామాజిక న్యాయం దెబ్బతింటున్నదని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ సందేశ్ యాత్ర(బైక్ యాత్ర) సోమవారం సదాశివపేట పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైంది. ప్రారంభ సూచికంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాణిక్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సామాజిక న్యాయానికి గొడ్డలి పెట్టుగా మారిందన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలు అమలు చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుక రిస్తున్నదని.. దీంతో రిజర్వేషన్లు లేకుండా పోతున్నాయన్నారు. దేశ సంపదను బడా పెట్టుబడిదారులకు కట్ట పెడుతూ ఊడిగం చేస్తున్నదన్నారు. నీతి అయోగ్ పేరుతో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ లేకుండా చేసిందన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై



బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత గిరిజన మైనార్టీ బీసీ మహిళలపై అత్యధికంగా దాడులు జరుగుతున్నాయన్నారు. అంబేద్కర్, పూలే మహనీయుల జయంతుల సందర్భంగా ఫోటోలకు దండేసి దండం పెట్టడం కాదని.. వారి ఆశయ సాధన కోసం నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి.అశోక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్, పట్టణ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గోంగూలూరు ప్రభు, కేజీకేయస్ జిల్లా కార్యదర్శి రమేష గౌడ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, కేవీపీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు రాం చందర్, నాయ కులు ప్రభు, విష్ణు, శ్రీనివాస్, విజయ్,

నంగునూరులో అంబలి కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నంగునూరు

బాటసారుల ఆకలి తీర్చేందుకు సోమవారం మండల కేంద్రమైన నంగునూరులోని ప్రయాణ ప్రాంగణం సమీపంలో కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మెన్ వంశీధర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని స్థానికులతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు అంబలి పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. కేంద్రాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రాజిరెడ్డి, అనిల్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




హాస్టళ్లకు ప్రహరీ గోడ నిర్మించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని దౌల్తాబాద్ బీసీ, ఎస్సీ హాస్టళ్లకు ప్రహరీ గోడ నిర్మించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శరత్‌కు వినతి పత్రం అందజేసినట్టు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ తెలిపారు. వసతి గృహాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మారుతి రాజు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ 2

సంగారెడ్డి

మంగళవారం 11 ఏప్రిల్ 2023

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు



నవతెలంగాణ-గుమ్మడిదల

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు అని పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అనంతారం గ్రామంలో సోమవారం నిర్వహించిన కామరతి బీరప్ప జాతర, గుమ్మడిదలలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొన్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వివిధ నూతన దేవాలయాల నిర్మాణాలకు అండగా నిలుస్తున్నామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు, ప్రజా ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సుపాస్ మేళ



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని దివ్యాంగుల కోసం డిపో మేనేజర్ మల్లేశయ్య, ఐకెపి ఏపీఎం కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఐకెపి కార్యాలయంలో బస్సుపాస్ మేళ నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మేళలో 25 మంది దివ్యాం గులు దరఖాస్తులు అందజేశారన్నారు.మిగిలిన వారు ఈనెల 31లోపు దర ఖాస్తు చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక ఫోటో, రూ.50 తీసుకొని ఏపీఎం లేదా సీసీ వెంకటరెడ్డికి అందజేయాలన్నారు. 100 శాతం సర్టి ఫికెట్ ఉన్న వాళ్ళకి, మెంటల్ సర్టిఫికెట్ ఉన్న వాళ్లకు ఒక మనిషి ఎస్కా ర్ట్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు స్వీకరించిన వారిలో ఆర్టీసీ మార్కె టిం గ్ సేల్ ఇన్చార్జ్ పాండు, ఐకెపి సీసీ వెంకట్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9441071134.లేదా 7382830800ను సంప్రదించాలన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలలోని మంబాపూర్ గ్రామానికి చెందిన యాట అండాలు అనారోగ్యంతో మృతి చెందింది. కాగా మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రగాఢ సాను భూతిని తెలియజేస్తూ.. అంత్రక్రియల ఖర్చు నిమిత్తం రూ.10,000ను సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేయించారు. అందజేసిన వారిలో ఉపసర్పంచ్ యాట దయానంద్, గ్రామ కమిటీ అధ్యక్షులు చాకలి ప్రకాష్, నరేందర్, దొంతి కొమరేష్, రొయ్యపల్లి ఆంజనేయులు, రొయ్యపల్లి నర్సింలు, భాజ భాస్కర్ గౌడ్ తదితరులు ఉన్నారు

మసీదుకు మైక్ సెట్ బహుకరణ



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని నర్రిగూడలో గల మసీదుకు ఎన్ఎంఆర్ యువ సేన సోమవారం మైక్ సెట్‌ను బహూకరించింది. బీఆర్ఎస్ నేత చిట్కుల్ గ్రామపంచాయతీ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ రూ.30 వేల విలువ గల మైక్ సెట్‌ను అందించినందుకు ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, యన్ఎంఆర్ యువసేన బృందం, పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్య చికిత్సకు సాయం..

మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన నాగారం యాదగిరి కుమారుడు అద్విక్‌ను వీధి కుక్క గాయపరిచింది. దీంతో బాలుడి వైద్య ఖర్చులకు నీలం మధు ముదిరాజ్ రూ.5000 అందించారు.

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు సన్మానం



నవతెలంగాణ-జోగిపేట

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గందని శ్రీనివాస్‌ను ఆదివారం రాత్రి కుకుట్ పల్లిలోని విశ్వనాథ్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా డయాబెటిస్ అధ్యక్షులు డాక్టర్ కే. అనంతరెడ్డి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-జహీరాబాద్

రంజాన్ మాసం పురస్కరించుకొని బైతుల్ ఇందాక ట్రస్ట్ వారు మండలంలోని సత్వార్ చిరాకుపల్లి గ్రామాల్లోని నిరుపేదలకు నిత్యవసర వస్తువులను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హీరో ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి మహమ్మద్ బుజీబ్ మౌలానా మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిరుపేదలను గుర్తించి వారికి నిత్యవసర వస్తువులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. చలికాలంలో దుప్పట్లు, నిరుపేదలు నివసించే కాలనీలలో నీటి సౌకర్యం లేకపోతే వారికి బోర్లు తవ్వించడం, ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి వారికి పాడి పశువులను ఇప్పించడం, కోళ్లను ఇప్పించడం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీంతోపాటు అతి తక్కువ ఫీజులతో పాఠశాలలు నడిపించి ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు విద్యను కూడా దానం చేస్తున్నామన్నారు.

గొర్రెల కాపరుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-జోగిపేట

గొర్రెల పెంపకదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని ఆందోల్ ఎంపీపీ జోగు బాలయ్య అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో మండల గొర్రెల పెంపకం దారుల సంఘాల సభ్యులకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, అర్హులు తమ వాటా దనాన్ని తక్షణమే చెల్లించాలన్నారు. వచ్చే నెలలో గొర్రెలను పంపిణీ చేనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ గీత, ఎంపీడీవో సత్యనారాయణ, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

14వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ పైతర గారి దుర్గేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోర బోయిన నాగరాజ్, చందర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, రవీంద్ర గౌడ్, సంతోష్, వెంకటేశం, కాలనీ అధ్యక్షులు రాధా కిషన్ గౌడ్, జనరల్ సెక్రెటరీ కొత్త మల్లయ్య, సలహాదారుడు నరసింహ గౌడ్, గొల్ల శ్రీశైలం, తుపాకుల సునీల్, ఆనంద్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి సోమవారం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేసినట్టు పార్టీ నాయకులు పుట్ట నరసింహారావు తెలిపారు. అనంతరం దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా వారిని ఆలయ నిర్వాహకులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్ది ప్రతాప్ రెడ్డి, టీపీసీసీ మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, పుట్ట నర్సింగరావు, మహిపాల్ రెడ్డి, సాయి చందర్, బాలరాజ్, మల్లేష్,యాదగిరి, గిరిప్రసాద్, దయాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, సందీప్, రోహిత్ రెడ్డి, బాల్‌రెడ్డి, బాలు, మురళి, వాసు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్
- మహనీయుల జయంతోత్సవాల నిర్వహణ, రెండో విడత గొర్రెల పంపిణీ ఏర్పాట్లు, మంత్రి పర్యటనపై సమీక్షా



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించి మహనీయుల జయంతోత్సవాల నిర్వహణ, రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు, మంత్రి పర్యటన ఏర్పాట్లు, హైదరాబాద్ లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జిల్లా ప్రజలు పాల్గొనేందుకు చేయాల్సిన ఏర్పాట్ల పై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ మాసంలో నిర్వహించు ఆయా మహనీయుల జయంతోత్సవాలలో అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి పూర్తి ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గొర్రెల పంపిణీ అమలు విధి విధానాలపై లబ్దిదా రులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా లబ్దిదారుల వాటా సేకరించాలని సూచిం చారు. ఇట్టి విషయమై నియోజక వర్గస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈనెల 14న హైదరాబాదులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్ర మంలో జిల్లా నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని ఆయా అధికారులకు సూచిం చారు. జిల్లా నుండి హైదరాబాద్ కార్యక్రమానికి సజావుగా చేరుకునే విధంగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ప్రతి నియోజ కవర్గం నుండి 300 మంది హాజరయ్యేలా చూడాల న్నారు. ప్రతి బస్సుకు లైజన్ అధికారిని నియమించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలకు సూచించారు. కార్యక్రమానికి వెళ్లే వారికి బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, వాటర్ బాటిల్స్, తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈనెల 11 మరియు 12న రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు జిల్లాలో వివిధ కార్యక్ర మాలలో పాల్గొననున్న నేపథ్యంలో ఆయా కార్యక్రమాల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఆయా అధికారులకు సూచిం చారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆయా జిల్లా అధికా రులు, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామి జాతరలో నీలం మధు

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అనంతారం గ్రామంలో నిర్వహిస్తున్న మల్లికార్జునస్వామి, బీరప్పల జాతరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు జాతర నిర్వాహకులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే జాతర్లకు, బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. అనంతరం దేవాలయ నిర్వాహకులు ఆయన్ను ఘనంగా శాలువలతో సత్కరించారు. సర్పంచ్ దీప నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ స్వరూప లక్ష్మణ్, వార్డు సభ్యులు వెంకటేశ్, రమణ, మల్లేష్, బిక్షపతి, అలయ కమిటీ అధ్య క్షులు యాదిరెడ్డి, మాజీ సర్పంచ్‌సత్తయ్య, మాజీ ఉపసర్పంచ్ గోపా ల్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కంబాలపల్లిలో బలగం ప్రదర్శన

నవతెలంగాణ-ఝరాసంగం

ప్రస్తుతం సమాజంలో బంధుత్వాలను మరిచి.. అన్నదమ్ముల ఆప్యాయతలను మరచి.. భూముల కోసం, ఆస్తుల కోసం అన్నదమ్ముల కుమ్ములాడుకుంటున్న రోజులివి. ఇలాంటి రోజుల్లో హాస్యనటుడు వేణు దర్శకత్వంలో విడుదలైన బలగం.. బంధుత్వాలకు ఓ బలమైంది. కాగా ఈ సినిమాను ఆదివారం రాత్రి మండలంలోని కంబాలపల్లి, బొప్పాంపల్లి గ్రామంలో ప్రదర్శించారు. గ్రామానికి చెందిన హనుమన్న పటేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుమారులు ఈశ్వర్ పాటిల్, విజయ్ పాటిల్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రత్యేక టెంట్లు, కుర్చీలు, నీటి సౌకర్యం తదితర ఏర్పాటు చేసి ప్రొజెక్టర్ల ద్వారా సిని మాను ప్రదర్శన చేశారు. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరి కళ్ళల్లో నీళ్లు వచ్చాయని.. గ్రామస్తులు తెలిపారు. యువకులు పి. సుధాకర్ రెడ్డి రాఘవేందర్, విష్ణువర్ధన్ రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, సుభాష్ యాదవ్, కొత్తపల్లి అంజిరెడ్డి, కేపీ.వెంకట్ రెడ్డి, బంటు అశోక్,బంటు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పటుగొమ్మలు

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేమాణిక్ రావు
- సమ్మేళనంలో సమస్యల వెల్లువ..

నవతెలంగాణ-ఝరాసంగం

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని జహీరాబాద్ ఎమ్మెల్యే కే మాణిక్‌రావు అన్నారు. సోమవారం ఝరాసంగం మండల మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో 16 గ్రామా లకు సంబంధించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహి ంచారు. మండల అధ్యక్షులు రాచయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమా కాంత్ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మెన్ శివ కుమార్ మాట్లాడుతూ.. స్వయానా తమ గ్రామంలో నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే మాణిక్‌రావు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరిం చాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి అన్ని విధాల ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైనికుల్లాగా పని చేయాల



న్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి తెలంగాణలో జరిగిందన్నారు. రైతులే దేశానికి రాజులని గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తు చేశారు. పెట్టుబడి సాయం కింద ఎకరానికి పదివేల రూపాయలతో పాటు రైతులకు రైతు బీమా, ఉచిత కరెంటు అందించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. అనంతరం ఆర్యవైశ్య సత్రం ముందు జరా సంఘం గ్రామానికి సంబంధించిన వైకుంఠ రథాన్ని కేతకీ ఆలయ చైర్మెన్ నీలా వెంకటేశం గ్రామ పంచాయతీ కి ఎమ్మెల్యే చేతుల మీదుగా డొనేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్ పాటిల్, మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు జగదీశ్వర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో సమస్యలు వెల్లువ...

ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు గ్రామాల వారీగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మేదపల్లి గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల సురక్షిత మంచినీరు రావడం లేదని సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ ఆవేదన వ్యక్తం చేశారు. గినియర్‌పల్లి మాజీ సర్పంచ్ నర్సింలు మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీలో మాజీలకు గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పనగర్ గ్రామ అధ్యక్షులు నర్సింలు మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వెనకడుగు వేయకుండా వెంటనే మాఫీ చేయాలని సభాముఖంగా వెల్లడించారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన సమస్యలను ఆయా గ్రామాల సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

'డబుల్' ఇల్లు మంజూరు చేయాలని సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

- తనపై కేసులు ఎత్తివేయాని డిమాండ్
- ఎస్సై సర్దిచెప్పడంతో కిందికి..



నవతెలంగాణ-జోగిపేట

డబుల్ ఇల్లు మంజూరు చేయాలనే డిమాండ్‌తో.. పింఛన్ వస్తలేదనే అసహనంతో ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన సోమవారం ఉదయం జోగిపేట పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన కుమ్మరి రామచందర్ తనపై ఉన్న పోలీస్ కేసులను ఎత్తివేయాలని, తనకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేయాలనే డిమాండ్‌తో, పింఛన్ రావడం లేదని అసహనంతో జోగిపేటలోని సెల్‌టవర్‌ను ఎక్కాడు. విషయం తెలుసు కున్న జోగిపేట ఎస్ఐ జైశంకర్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని.. అతనితో మాట్లాడారు. తన కాలుకు ఆపరేషన్ అవసరమని, పింఛన్ వస్తలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు చేయించాలని, తనపై ఉన్న కేసులను ఎత్తివేయాలని రామచందర్ డిమాండ్ చేశాడు. వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఎస్ఐ హామీనిచ్చారు. డబుల్ బేడ్ రూమ్ ఇళ్ల మంజూరు కోసం సంబంధిత అధికారులకు తెలియజేస్తామని స్పష్టమైన హామీనివ్వడంతో ఆ యువకుడు సెల్‌టవర్ నుంచి కిందకు దిగాడు. రాంచందర్‌పై నర్సాపూర్, మెదక్, జోగిపేట పోలీస్ స్టేషన్‌లలో చిల్లర కేసులున్నాయని ఎస్ఐ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి అతనికి కౌన్సిలింగ్ ఇంటికి పంపిచేశారు.

అబిద్ సామాజిక సేవలు అభినందనీయం



నవతెలంగాణ-పటాన్‌చెరు

బీఆర్ఎస్ యువ నాయకులు అబ్దుల్ అబిద్ కొన్నేండ్లుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు నేటి యువతరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మధు సూదన్‌రెడ్డి అభినందించారు. మండలంలోని ముత్తంగి రామరాజునగర్‌లో రంజాన్ మాసం పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అబిద్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం 300 మంది వికలాంగులు, గ్రామపంచాయతీ వర్కర్లు, నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబిద్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మధు సూదన్ రెడ్డి సరుకులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మధు మాట్లాడుతూ.. కుల మతాలకతీతంగా పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకోవడం అభినందనీయమన్నారు. అబ్దుల్ అబిద్ మాట్లాడుతూ.. సామాజిక సేవ చేయాలని సద్దుదేశ ంతోనే పేదవారికి తన వంతు సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం కుల మతాల కతీతంగా పేదవారికి సరుకులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్, మేరాజ్ ఖాన్, నిజాం ఖాన్, సోయాల్ ఖాన్, అబ్దుల్ సలీం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు సప్లిమెంటరీలో అవకాశం కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బాధిత విద్యార్థులతో కలిసి డీఈవో ఆఫీస్ ఎదుట 3గంటల పాటు ధర్నా



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో 10వ తరగతి పరీక్షలు రాయలేకపోయిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు సప్లిమెంటరీలో అవకాశం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బాధిత విద్యార్థులతో కలిసి డీఈవో ఆఫీస్ ఎదుట మూడు గంటలపాటు ధర్నా చేశారు. దీంతో డీఈవో విజయ వచ్చి వినతి పత్రం స్వీకరించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ చేసిన పనికి విద్యార్థుల నష్టపోయారని.. కాబట్టి వారికి సప్లిమెంటరీ పరీక్షలు రాసుకోవడానికి వెసులుబాటు కల్పించాలన్నారు. టెన్త్‌బోర్డ్, విద్యాశాఖ అధికారులతో మాట్లాడి సప్లిమెంటరీ పరీక్షల్లో రాసే విధంగా చూస్తామని విద్యాధికారి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజేష్ ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లేష్, విషువర్ధన్, అతిక్, ముజాహిద్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్‌లో నో సిగ్నల్..

- సర్వర్ రాకపోవడంతో స్తంభిస్తున్న సేవలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల తహసీల్దార్ కార్యాలయంలో సిగ్నల్ సరిగా లేకపోవడంతో ఆన్‌లైన్ పనులు స్తంభించిపోతున్నాయి. దీంతో ఆయా పనులు మీద కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం వస్తే ఎప్పుడూ సిగ్నల్ సమస్యలే వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి సిగ్నల్ సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.



రేపు అందోల్‌లో మంత్రి హరీశ్‌రావు పర్యటన

- పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పిలుపు



నవతెలంగాణ-జోగిపేట

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు రాష్ట్ర ఆర్థిక, వైద్యా శాఖ మంత్రి హరీశ్ రావు రేపు(బుధవారం) అందోల్‌లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులు, నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లలో ఏలాంటి ఇబ్బందులు ఉండకుండా చూడాలన్నారు. రేపు ఉదయం 11 గంటలకు జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పంపిణీ, 11.30 గంటలకు హైవే రోడ్డు నుంచి అందోలు వరకు రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేసి.. 12 గంటలకు అందోల్‌లోని లక్ష్మీనర్సింహా గార్డెన్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అందోలులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద యోగా సెంటర్‌కు శంకుస్థాపన, 2.30 గంటలకు అందోలులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రారంభోత్సవం, 3 గంటలకు అందోలులోని బస్తీ దవాఖానా ప్రారంభోత్సవం, 3.30 గంటలకు రూ.2 కోట్ల టీఎస్‌యుఐడీఎఫ్ నిధులతో మాడ్రన్ ధోభీ ఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, సాయంత్రం 4 గంటలకు అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.25 కోట్ల సీసీ రోడ్డు పనులకు శంకు స్థాపన, 4.30 గంటలకు జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం, సాయంత్రం 4.45కు జోగిపేటలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ, 5గంటలకు జోగిపేటలో పునఃరుద్ధరించబడిన క్లాక్‌టవర్ ప్రారంభం, 5.10 గంటలకు బహద్దూర్ ఖాన్ ఫంక్షన్ హాల్, షాదీఖానా పనుల కు శంకుస్థాపన, జోగిపేటలోని 252 డబుల్‌బెడ్ రూం ఇళ్ల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. మండల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హజరు కావా లని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వరం చైర్మెన్ వీరారెడ్డి, తహసీల్దార్ వెంకటేష్, పిఆర్ డిప్యూటీ ఈఈ కురుమయ్య, ఏఈ మొగులయ్య, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, మాజీ మార్కెట్ చైర్మెన్‌లు మల్లిఖార్జున్, డీబీ.నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు రామగౌడ్, వెంకటేశం, అధికారులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ ముందంజ



నవతెలంగాణ-హత్నూర

సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉన్నదని ఎమ్మెల్యే చిలుముల మధన్ రెడ్డి అన్నారు. మండలంలోని మంగాపూర్ గ్రామ శివారులో గల ఎస్ఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు వివిధ గ్రామాలకు చెందిన పార్టీ కార్య కర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చారు. డప్పు చప్పుళ్ళతో భారీగా ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో అమలుకు సాధ్యం కాని సంక్షేమ పథకాలు తెలంగాణలో విజయవంతంగా అమలవుతు న్నాయన్నారు. రైతు బీమా, రైతు బంధు,కళ్యాణ లక్ష్మి, పెన్షన్లు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా,రైతులకు ఉచిత విద్యుత్ లాంటి ఆదర్శవంతమైన పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దేనన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ నాయకులపై చేస్తున్న అసత్యపు ఆరోప ణలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి.. మూడోసారి కూడా బీఆర్ఎస్‌నే అత్యధిక మెజారిటీతో ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ దేవేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ మంజుశ్రీ, మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా కోఆప్షన్ నెంబర్ మన్సూర్ అలీ, జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీపీ నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పీఏసీ ఎస్ చైర్మెన్‌లు దామోదర్‌రెడ్డి దుర్గారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లిలో 4వ రోజు విద్యార్థులతో నిరసన



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులో నిర్మాణం చేపడుతున్న సురభి కెమికల్ పరిశ్రమ మాకొద్దంటూ వడ్డేపల్లి ప్రజలు నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం కోనంపేట్ పాఠశాల విద్యార్థులు నిరసనలో పాల్గొని.. కాలుష్య కారక పరిశ్రమ తమకొద్దంటూ నినాదాలు చేశారు. గ్రామ మహిళలు ప్రధాన రహదారిపై బతుకమ్మ ఆటపాటలతో ఆందోళన చేపట్టారు. పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ శశికళ వాసుదేవరావు మాట్లాడుతూ.. సురభి కెమికల్ పరిశ్రమ వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వ్యవసాయదారులు పలు రకాల అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉన్నదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పరిశ్రమ నిర్మాణం ఆపాలని డిమాండ్ చేశారు. లేనియెడల పరిశ్రమలు ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షులు దండు ప్రవీణ్‌రావు, చంద్రశేఖర రావు, హనుమంతరావు, లక్ష్మణ్ చారి, సర్పంచ్ స్వరూప, ఉప సర్పంచ్ సురేష్‌గౌడ్, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాస్ కాఫింగుకు పాల్పడితే చర్యలు తప్పవు

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



నవతెలంగాణ-మెదక్ డెస్క్ : పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షలు రాయాలని, చీటింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదిలో బాగా చదివి ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థికి తొలిమెట్టు పదవ తరగతి అని తెలిపారు. ఏకాగ్రతతో కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం పరీక్ష కేంద్రంలోని రూములను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తనిఖీ చేశారు. ఆయన వెంట ఇన్చార్జి తహసీల్దార్ తారాబాయి, ఆర్ఐ శ్రీహరి, పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం రాధా కిషన్ తదితరులు ఉన్నారు.



అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మెదక్ టౌన్



జిల్లాలో ఉన్న ప్రైవేట్ స్కూల్స్ పర్మిషన్ లేకుండా స్కూల్స్ అడ్మిషన్స్ ప్రారంభించాయని పదో తరగతి ఎగ్జామ్స్ జరుగుతుండగానే అడ్మిషన్స్ తీసుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రం కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ జూన్ నెలలో తీసుకోవాల్సిన అడ్మిషన్స్ ఇప్పటి నుంచే తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం నడవాల్సిన ప్రైవేట్ స్కూల్స్ ఇష్టానుసారంగా నడుస్తున్నాయన్నారు. మండలంలో ఉన్న ఎంఈఓ, డీఈవోలు ప్రైవేట్ స్కూల్స్ అడ్మిషన్స్ ప్రారంభిస్తే చర్యలు తీసుకోవడంలో వెనకబడుతున్నారని, పర్యవేక్షణ చేయడం లేదని స్పష్టం చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలు ఆగడం లేదన్నారు. అనుమతులు లేకుండా అడ్మిషన్స్ తీసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, గుర్తింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

ఊపందుకున్న ఐపీఎల్ బెట్టింగులు

- యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లోనే బెట్టింగులు
- గుర్తించలేకపోతున్న పోలీసులు
- అప్పులు చేసి మరీ పందేలు కాస్తున్న పరిస్థితి
- గెలిచేవారు 10 శాతం.. కోల్పోయేవారు 90 శాతం

నవతెలంగాణ- కొల్చారం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ సీజన్ ప్రారంభం కావడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ఆన్‌లైన్ బెట్టింగులు మొదలయ్యాయి. కొల్చారం మండలం దుంపలకుంట, రంగంపేట చౌరస్తాలను అడ్డాగా చేసుకుని సాయంత్రం వేళ బెట్టింగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే యువకులు ప్రత్యేకించి సంబంధిత యాప్‌లను డౌన్ లోడ్ చేసుకుని జోరుగా పందేలు కాస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కొందరు ఇంటి నుంచి కదలకుండానే బెట్టింగులు జరుపుతున్నట్లు సమాచారం. గత నెల 31వ తేదీన ప్రారంభమైన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు మే నెలాఖరు వరకు జరగనున్న విషయం తెలిసిందే. దీంతో బెట్టింగురాయుళ్ల కోలాహలం జోరుగా పెరిగింది. తొలి రోజు నుంచే ఆన్‌లైన్‌లో పందేలు కాస్తున్నట్టు తెలిసింది. ఆండ్రాయిడ్ ఫోన్ చేతిలో వుంటే చాలు ప్లేస్టోర్ నుంచి సంబంధిత యాప్‌లను డౌన్ లోడ్ చేసుకుని పందేలు కాసే వెసులుబాటు కలిగింది. దీంతో ఎవరు, ఎక్కడ బెట్టింగులకు పాల్పడుతున్నారో గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని పోలీసులు తల పట్టుకుంటున్నారు. ఇందులో కళాశాల విద్యార్థిలు, యువకులు, చిరుద్యోగులు, వృత్తి కార్మికులు ఐపీఎల్ బెట్టింగుల్లో పాల్గొంటున్నట్టు సమాచారం.

బెట్టింగుల కోసం ఆన్‌లైన్ రుణాలు

కొంతమంది యువకులు క్రికెట్ బెట్టింగుల కోసం ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా అధిక వడ్డీకి రుణాలు తీసుకుంటున్నట్టు తెలిసింది. మరికొంత మంది స్థానికంగా నెలకు నూటికి రూ.5 చొప్పున వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. చేతిలో డబ్బులు లేకపోతే ద్విచక్ర వాహనాలను, బంగారం ఉంగరాలను తాకట్టు పెట్టి మరీ బెట్టింగులకు పాల్పడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే క్రికెట్ బెట్టింగుల్లో డబ్బులు వచ్చిన వారు పది శాతం మంది వుంటే పోగొట్టుకున్న వారు 90 శాతం మంది వున్నారని కొందరు అంటున్నారు.



బాధిత కుటుంబానికి బాల్య మిత్రుల భరోసా

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన బిజ్జ భాగయ్య కుమారుడు విక్రమ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై మృతి చెందాడు. మృతి చెందిన విక్రమ్ కుటుంబీకుల ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఈ విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు ఎస్ఎస్‌సీ బ్యాచ్ 2000 సంవత్సరానికి చెందిన మిత్రులందరు కలిసి రూ.23,100లను మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జీపి స్వామి, వై భాస్కర్ రెడ్డి, కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు

నేడు జ్యోతిబాపూలే జయంతి

నవతెలంగాణ-మెదక్ రూరల్

సామాజిక సంస్కరణల నాందికర్త, మహిళలు, బలహీనవర్గాల విద్యాభివృద్ధికి రూపకర్త, సమ సమాజ స్థాపనకు స్ఫూర్తిదాత మహాత్మా జ్యోతిబా పూలే జయంతోత్సవాన్ని ఈ నెల 11వ తేదీన అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10-00 గంటలకు స్థానిక ధ్యాన్ చంద్ చౌరస్తా వద్ద గల పూలే విగ్రహానికి పుష్పమాలంకరణ, అనంతరం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో జ్యోతిభా పూలే చిత్ర పటానికి పుష్పామాలంకరణ, జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులు అర్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని బీసి, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, జిల్లాలోని ప్రజలు, అధికారులు, అనధికారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కాళ్లకల్ తైబజార్ వేలం రెండవసారి వాయిదా

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్



మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కాళ్లకల్‌లో చేపట్టిన తైబజార్ వేలం రెండవసారి వాయిదా పడింది. సోమవారం సర్పంచ్ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్ అధ్యక్షతన కార్యదర్శి శంకర్ గౌడ్ స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో తైబజార్ వేలాన్ని నిర్వహించారు. గత శుక్రవారం తైబజార్ వేలాన్ని నిర్వహించగా ఆరుగురు వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. రూ.9,71,250 లు ఉండగా పసుల దుర్గమ్మ రూ.9,15,000లకు పాట పాడారు. దాంతో ప్రభుత్వ నిర్ణయించిన ధర రాకపోవడంతో ఎంపీఓ లక్ష్మీ నరసింహులు సోమవారానికి వాయిదా వేశారు. కాగా సోమవారం నిర్వహించిన తైబజార్ వేలంలో ఐదుగురు వ్యాపారులు పాల్గొన్నారు. అంతలో గ్రామానికి చెందిన కొందరు కాళ్లకల్ గ్రామానికి చెందిన వారు మాత్రమే వేలంలో పాల్గొనాలని కోరారు. దాంతో తూప్రాన్‌కు చెందిన పసుల దుర్గమ్మ డిపాజిట్‌ను వాపస్ ఇవ్వడంతో కేవలం నలుగురు మాత్రమే వేలంలో పాల్గొన్నారు. అధికారులు వేలం పాట నిర్వహించగా రూ.9,15,000ల కంటే ఎక్కువ వేలం పాడకపోవడంతో రెండో సారి వాయిదా వేస్తున్నట్టు ఎంపీఓ లక్ష్మీనరసింహులు తెలిపారు తిరిగి మంగళవారం ఉదయం వేలంపాటను నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మల రాజు యాదవ్‌తో పాటు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

- ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని షాదీఖానాలో మున్సిపల్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం వైద్యులు మనిషికి గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఊపిరి ఆగి పోయినట్లయితే గుండెకు ఊపిరిని ఏ విధంగా ఇవ్వాలన్న తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. గుండె నొప్పి వచ్చినప్పుడు గుండెకు కృత్రిమంగా ఊపిరి నుంచి మళ్లీ కొట్టుకునే విధంగా చేయడమే సీపీఆర్ అని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చినప్పుడు ఊపిరి అందించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యులు ప్రజలకు వివరించాలన్నారు. ఒక ప్రాణాన్ని రక్షించడం అంటే దానికంటే పుణ్యం ఏముంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్యులు చెప్పిన సీపీఆర్‌ను చేసే విషయాలను గుర్తుంచుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో తెలిపిన విషయాలను పాటించి సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మదర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయనిర్మల, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నహిముద్దీన్, కమిషనర్ వెంకట గోపాల్, జెడ్పీటీసీ భబ్యా నాయ క్, నాయకులు హబీబ్ ఖాన్, శేఖర్, పంబల బిక్షపతి, దావూద్, పంబల రామచందర్, పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు సావధానంగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-మెదక్ రూరల్

ప్రజావాణికు వస్తున్న ఫిర్యాదీదారుల సమస్యలు సావధానంగా వింటూ సమస్యల పరిష్కారదిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదీదారుల నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌లతో కలిసి వినతులను స్వీకరించారు. అధికారులకు దిశానిర్దేశం చేస్తూ ఫిర్యాదీదారులలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా కల్పించారు. ప్రజావాణికి ప్రధానంగా ధరణి, భూ సమస్యలకు సంబంధించి వస్తున్న వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి సంబంధింత తహశీల్దార్, ఆర్.డి.ఓ.లతో ఫోన్‌లో సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే ఫిర్యాదులు అక్కడే పరిష్కరిస్తే ఫిర్యాదిదారులు జిల్లా కేంద్రానికి రావలసిన అవసరం ఉండదని, దీనివల్ల వారికి సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఫిర్యాదీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చూడాలని, లేనిపక్షంలో తగు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. కాగా నేటి ప్రజావాణిలో ధరణి, భూ సమస్యలు,ఆసరా పించన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కావలని వినతులతో పాటు పంచాయత్ రాజ్, సివిల్ సప్లైస్, మైన్స్, విద్యుత్, ఆర్.డబ్ల్యూఎస్, కార్మిక, వైద్య, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయం, మునిసిపాలిటీ తదితర శాఖలకు సంబంధించి వచ్చిన 42 వినతులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ నిర్ణీత సమయంలోగా పరిష్కరించి ప్రజావాణి పోర్టల్‌లో అప్ లోడ్ చేయవలసినదిగా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు వెంకట శైలేష్, భీమయ్య శ్రీనివాస్ రావు, జెంలా నాయక్, సుధాకర్, రజాక్, సాయిబాబా, నాగరాజ్, కమలాకర్, జానకి రామ్ సాగర్, విజయలక్ష్మి, ఇందిరా, డా. నవీన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఐపీఎల్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్సై శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట



ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్లు జరుగుతున్నందున యువత బెట్టింగుకు పాల్పడవద్దని మెదక్ జిల్లా నిజాంపేట మండల ఎస్సై శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్లు జరుగుతున్నందున యువత బెట్టింగులకు పాల్పడవద్దని ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. రాష్ట్రంలో బెట్టింగులు కట్టుకుంటూ అప్పుల పాలై అక్కడక్కడ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మండలంలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, యువకుల ప్రాణాలు కాపాడిన వారు అవుతారని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చందాయిపేటలో కంటి వెలుగు

నవతెలంగాణ- మెదక్ డెస్క్



మండలంలోని చందాయిపేట గ్రామంలో రెండో విడత ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్య అధికారి చందు నాయక్, స్థానిక సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజులు సోమవారం ప్రారంభించారు. అనంతరం కంటి పరికరాలను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి చందు నాయక్ మాట్లాడుతూ గ్రామంలో తొమ్మిది రోజులు కంటి వెలుగు శిబిరం కొనసాగుతుందని, గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అన్ని జ్ఞానేంద్రియాలోకెల్లా కళ్ళు ప్రధానమైనవన్నారు. కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, కళ్ళు లేకుంటే ప్రపంచమే గుడ్డిగా కనిపిస్తుందని, కళ్ళే శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతోష్ కుమార్, వైసీ ఎంపీపీ రామచంద్రం, మండల వైద్యాధికారి అనిల్ కుమార్, ఎంక్వైరీ ఆఫీసర్ రాజేందర్, సెక్రెటరీ కృష్ణ, ఏఎన్ఎం అనురాధ, నవనీత, పి హెచ్ ఎం సంపతి, ఫార్మసిస్ట్ పగడయ్య, మెయిల్ వర్కర్ రాజిరెడ్డి, వార్డుసభ్యులు అమృత, రమ్య, లావణ్య, శోభన్, ఆశ వర్కర్లు లలిత, అరుణ, రేణుక, సమత, భాగ్య, అంగన్వాడి టీచర్ ఫరీదా, పాల్గొన్నారు.

దోమతెరలను వాడాలి

- డాక్టర్ హరిప్రియ

నవతెలంగాణ-నిజాంపేట



క్యూలెక్స్ దోమ కాటు వల్ల బోదకాలు వ్యాధి వస్తుందని, బోదకాలు వ్యాధి వ్యాపించకుండా ప్రతి ఒక్కరు దోమతెరలను వాడాలని ధర్మారం వైద్యాధికారి డాక్టర్ హరి ప్రియ అన్నారు.. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో చల్మెడ గ్రామంలో బోదకాల వ్యాధి బాధితులకు ఫైలేరియా నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేస్తూ, వారికి కిట్లు అందజేయడం జరిగిందని ధర్మారం వైద్యాధికారి డాక్టర్ హరిప్రియ జిల్లా మలేరియా అధికారి కుమారస్వామి తెలిపారు. ధర్మారం ఆరోగ్య కేంద్రం పరిధిలో 565 మందికి బోదకాలు వ్యాధి వ్యాపించిందని, చల్మెడ గ్రామంలో 48 మందికి బోదకాలు వ్యాధి సోకిందని వ్యాధి సోకకుండా గ్రామస్తులు దోమతెరలు వాడాలన్నారు. అదేవిధంగా వ్యాధి సోకిన వారు తగు జాగ్రత్తలు సూచనలు పాటించాలని వైద్యాధికారి హరిప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్మెడ గ్రామ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్ వైద్య సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ వారోత్సవాల నిధి సేకరణ

- ఏప్రిల్ 6 నుంచి 14 వరకు జయంతోత్సవాలు
- రాజ్యాంగాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్



నవతెలంగాణ-మెదక్ టౌన్

సమాజంలోని అన్ని రకాల పీడన దోపిడీల నుంచి సంపూర్ణ విముక్తి కొరకు సీఐటీయూ నిలబడుతుందని కుల వివక్ష అనచివేత దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీసులో సామాజిక న్యాయ నిధి సేకరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత గిరిజన మధ్య తరగతి హక్కులపై పోరాడిన సామాజిక వ్యక్తుల జయంతి, వర్ధంతి ఉత్సవాలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రాజ్యాంగ రక్షణ రిజర్వేషన్ల పరిరక్షణ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, మత సమరస్యం, ఫెడరలిజం వంటి మూల స్తంభాల రక్షణ కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందన్నారు. జ్యోతిరావు పూలే జయంతి, అంబేద్కర్ జయంతి సందర్భంగా పాదయాత్రలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. సామాజిక న్యాయ వార్షికోత్సవాల జయప్రదం కోసం నిధి సేకరణ చేస్తున్నామని, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, సేవా సంస్థలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జగన్ పాల్గొన్నారు.

ముస్లింలకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ పట్టణంలోని షాదీ ఖానాలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద ముస్లింలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకుని పట్టణంలోని షాదిఖానాలో ముస్లిం మత పెద్దల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమం సఫా-బైతుల్-మాల్‌లో పేద ముస్లింల కుటుంబాల తరపున ముస్లిం మహిళకు మత పెద్దలు నిర్ణయించిన రుసుము చొప్పున మొత్తంగా ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేద వాళ్లకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో మౌలానా జావేద్‌ను సంప్రదించగా వివరాలు తెలిపారని దానికి తాను సంసిద్ధత వ్యక్తం చేసి సోమవారం వారికి ఆర్థిక సహాయం అందజేశామనిబ ఎమ్మెల్సీ తెలిపారు. రాజకీయాలకతీతంగా పేదరికంలో ఉన్న ముస్లింలు ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత నాయకుల ద్వారా తనను సంప్రదిస్తే తనకు తోచినంత సహాయం చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. పేదల ఆకలి బాధ తెలియాలనే రంజాన్ ఉపవాస దీక్షల ఉద్దేశ్యం అని తాను భావిస్తానని ఎమ్మెల్సీ అన్నారు. ఈ రంజాన్ మాసంలో నియమబద్ధంగా ఉపవాసం ఉండి అల్లా కృపకు పాత్రులు కావాలని ఎమ్మెల్సీ కోరారు. ఈ రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింల కుటుంబాలన్నీ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా జావిద్, సయ్యద్ ఖలీల్, సయ్యద్ హసన్ మొహమ్మద్, సాజియోద్దీన్ కబీల్, ఆసిఫ్ అలీ ఇక్బాల్, మీర్ అస్గర్ అలీ, సలాం, హఫీజ్ మొలసబ్, కౌన్సిలర్ గడ్డమీది కృష్ణా గౌడ్, సర్పంచులు నోముల శ్రీకాంత్, యామిరెడ్డి, సాయా గౌడ్, మహిపాల్ రెడ్డి, శ్రీను నాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ గోపాల్ రావు, పార్టీ యువ నాయకులు మద్దెల భాస్కర్, ప్రశాంత్, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి 51 వ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-వెల్దుర్తి



శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి 51వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో కోమటి పల్లె వీధిలో అంగరంగ వైభవంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే పుణ్య వాచనం వృత్తి కవనం పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషిత్ ముహూర్తమున శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర శివపార్వతులకు కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఒడిబియ్యాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అర్చకులు దత్తు పంతులు మాట్లాడారు లోక కళ్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన ప్రజలు సుభిక్షంగా ఉంటారని, ఇంటిల్లిపాదన సుఖసంతోషాలతో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావన అలవర్చుకున్నట్లయితే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు కోమిరిశెట్టి రమేష్ చందర్ గుప్తాతో పాటు మరికొంతమంది భక్తులు పాల్గొన్నారు.

చెరువు అలుగు పనులను నాణ్యతతో చేపట్టాలి

- ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్



గ్రామ పెద్ద చెరువు అలుగు పనులను నాణ్యతతో చేపట్టి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ ర్యాకల హేమలత శేఖర్ గౌడ్ దత్తత గ్రామం గౌతోజిగుడలో గౌతోజీగూడ నుంచి సికింద్లపూర్ వరకు వెళ్ళే దారిలో గూడెం చెరువుకు అలుగు సరిగ్గా లేనందున నిర్మాణానికి రూ.8.5 లక్షలు మంజూరయ్యాయి. మంజూరైన రూ.8.5 లక్షలతో నిర్మిస్తున్న మత్తడి పనులను డీఈ శ్రీకాంత్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఏఈ అనురాధ, వర్క్ఇన్స్పెక్టర్ రాజు జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు పంచమి రేణు కుమార్ సెక్రెటరీ నందిని వార్డు సభ్యులు పెంటమ, భవాని, ఆంజనేయులు, శ్రీనివాస్, పద్మ నాయకులు పాల్గొన్నారు.

పేదల నడ్డి విరుస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు

- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ- మెదక్ డెస్క్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల ఉసురు పోసుకుంటున్నారని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చేగుంట మండలం కన్నారం (కరీంనగర్) గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఆత్మగౌరవ యాత్రలో భాగంగా ఇల్లిల్లు తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం గతంలో ముత్యం రెడ్డి చేసిన అభివృద్ధి తప్ప, బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామని, ప్రజల సమస్యలు తీరుతాయని, చేగుంట అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన ఏలుతుందని, వారికి రాజకీయ ఉద్యోగాలు లభించాయని, నిరుద్యోగులు బ్రతుకుతెరువు లేక బంగారు తెలంగాణలో తల్లిదండ్రులపై ఆధారపడి బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతోమంది ప్రాణాలర్పించారని, బంగారు తెలంగాణలో నిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్నారన్నారు. ప్రజల సమస్యలు, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, అప్పుడే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు స్టాలిన్ నర్సింలు, వడ్ల నవీన్, పుర్ర ఆగం, శ్రీనివాస్, కొండి శ్రీనివాస్, తాహిర్, నాగులు, శంకర్ నాయక్, ఫకీర్, రాజు, బద్య, విట్టల్, పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా చంద్రయ్య

నవతెలంగాణ-నర్సాపూర్



బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా మెదక్ జిల్లా ఉపాధ్యక్షులుగా నర్సాపూర్ పట్టణానికి చెందిన నీరుడి చంద్రయ్యను నియమించారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు యాదగిరి సోమవారం నర్సాపూర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో చంద్రయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్ గౌడ్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మైపాల్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు కుమార్, నర్సాపూర్ బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి బాల్‌రాజ్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు బబ్బూరి కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశత్తు పూరి గుడిసె దగ్ధం



నవతెలంగాణ-నర్సాపూర్ : ప్రమాదవశత్తు షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం కావడంతో అందులో ఉన్న ఒక్క లక్ష యాభై వేల నగదు, మూడు కింటాళ్ల బియ్యం, పట్టా పాసు బుక్కులు తగలబడిపోయిన సంఘటన ఆదివారం రాత్రి నర్సాపూర్ మండల పరిధిలోని ఎల్లారెడ్డి గూడ తండాలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండల పరిధిలోని ఎల్లారెడ్డి గూడ తండాకు చెందిన నిషావత్ సిత్యకు చెందిన పూరి గుడిసె ఆదివారం రాత్రి ప్రమాదవశత్తు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. అయితే అందులో ఉన్న రూ.1,50,000 నగదు, మూడు క్వింటాళ్ల బియ్యం, పట్టా పాసుబుక్కులు నిత్యావసర సరుకులు, బట్టలు మంటల్లో తగలబడిపోయాయి. ఇది గమనించిన బాధితులు పూరి గుడిసెల నుంచి బయటకు వచ్చి అరుపులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పి వేయాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. పూరి గుడిసె దగ్ధమై రోడ్డున పడ్డ సిత్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ సంతోష బిఖ్య నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

రెండు బైకులు ఢీ, వ్యక్తి మృతి



నవతెలంగాణ-వెల్దుర్తి : రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలో చల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చర్లపల్లి తాండకు చెందిన చందర్ నాయక్ (57) వెల్దుర్తికి వచ్చి తండాకు బైకు పైన వెళుతున్న క్రమంలో బీహార్‌కు చెందిన వ్యక్తి బైకుపై ఎదురుగా వచ్చి చందర్ నాయక్ బైకును బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో చందర్ నాయక్ అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయారు హుటా హుటిన హాస్పిటల్ తరలిస్తున్న క్రమంలో చందర్ నాయక్ మృతి చెందినట్లు ఎస్సై మధుసూదన్ గౌడ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

జిల్లాలో ప్రశాంతంగా పది పరీక్షలు

- డిఇఓ రాధా కిషన్



నవతెలంగాణ-మెదక్ డెస్క్ : జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈఓ రాధా కిషన్ తెలిపారు. సోమవారం ఆయన రేగోడు లోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ టేక్మాల్, అల్లాదుర్గం, అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్, రేగోడు, పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

నవతెలంగాణ 4
సిద్దిపేట
మంగళవారం 11 ఏప్రిల్ 2023



ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని కూరెళ్ళ గ్రామంలో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి, బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి మాల సంఘం ఆధ్వర్యంలో రూ. ఒక లక్ష 16 వేలను సోమవారం గ్రామ సర్పంచ్ గాజుల రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో శ్రీలక్ష్మి, భూలక్ష్మి బొడ్రాయి ప్రతిష్టాపనకు ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్థులకు అన్ని విధాలుగా మంచి జరిగేందుకు గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మార్గం తిరుపతి, గాజుల రవీందర్, ఈగ మల్లయ్య, ఇట్టవేణి రేణుక, కొమురయ్య, చిట్యాల లక్ష్మి, శంకర్, బండారి నరేష్, మాల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేముల పోచమ్మ నక్షబాటను పునరుద్ధరించాలి

- తహసీల్దార్‌కు వ్యకాస నాయకుల వినతి



నవతెలంగాణ-చేర్యాల: మండల పరిధిలోని ముస్త్యాల గ్రామం నుంచి కొమ్ముల మసీదు, పెద్దనూతి తాళ్ల బావి గుండా వేముల పోషమ్మ దేవాలయం వరకు ఉన్న నక్ష బాటను పునరుద్ధరించాలని బీకేఎంయూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య కోరారు. నక్ష బాటను పునరుద్ధరించాలని బీకేఎంయూ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.కే ఆరిఫాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ ముస్త్యాల గ్రామంలో ఎన్నో ఏండ్ల క్రితం వెలసిన వేముల పోచమ్మ దేవాలయానికి వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది భక్తులు నిత్యం వస్తూ వెళ్తుంటారన్నారని, పూర్వం నుంచి ఉన్న ఈ నక్ష బాటను కొంతమంది రైతులు కబ్జా చేస్తూ దారికి ఆటంకం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొలతలు వేయించి హద్దురాళ్ళు ఏర్పాటు చేసి బాటను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశిరెడ్డి బాల్ రెడ్డి, కర్రె సత్తయ్య, చేర్యాల బాలయ్య, తోకల కొమురయ్య, ఎండి. షాదుల్లా, మహమ్మద్ నజీర్, మనేపల్లి కిష్టయ్య, గూడెపు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లె పల్లెకు ఓబీసీ, ఇంటింటికి బీజేపీ



నవతెలంగాణ-ములుగు

ములుగు మండలం ఓబీసీ మండల అధ్యక్షుడు బబ్బురి స్వామి గౌడ్ అధ్యక్షతన సోమవారం సింగన్నగూడెం గ్రామంలో పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ అనే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు నలగామా శ్రీనివాస్, ఓబీసీ మోర్చా సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి నరేంద్ర, జిల్లా కార్యదర్శి తలారి లక్ష్మణ్‌లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పల్లె పల్లెకు ఓబీసీ మోర్చా ఇంటింటికీ బీజేపీ అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పల్లె పల్లెకు ఓబీసీ గడపగడపకు బీజేపీ నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఓబీసీ మోర్చా పక్షాన కరపత్రాలు పెంచుతున్నామని, భారతీయ జనతా పార్టీ బీసీలకు ప్రథమ స్థానం ఇచ్చారని అందుకని గ్రామాలలో అవగాహన కలుగుతుందన్నారు. 9వ నిజాం అయినటువంటి కేసీఆర్ బీసీలను నయవంచన చేస్తున్నారనే విషయాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు. భారతీయ జనతా పార్టీలో బడుగు బలహీనులకు కూడా సరైన న్యాయం జరుగుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులు నలగామ శ్రీనివాస్ మాట్లాడుతూ సోమవారం భారతీయ జనతా పార్టీ తలపెట్టిన పల్లె పల్లెకు ఓ బి సి గడపగడపకు బిజెపి అనే కార్యక్రమం ప్రతి గడపగడపకి తీసుకెళ్తా బీసీలకు చేస్తున్న అన్ని కార్యక్రమాలను గ్రామాలకు వెళ్లి వివరిస్తారమన్నారు. భారతీయ జనతా పార్టీ బీసీల అభివృద్ధికి కృషి చేసిందని, కరపత్రాల ద్వారా వివరిస్తున్నామని పల్లెల్లో మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మన్నే శ్రీనివాస్ కిసాన్ మోర్చ కార్యదర్శి. కొట్టురి మల్లేష్ మండల ఉపాధ్యక్షులు, చింతల కుమార్ బూత్ అధ్యక్షులు, ధమ్మని జయరాములు కొక్కొండ భోగ మల్లేష్ కమ్మరి సద్గుణ కాశ పురుషోత్తం బద్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలి

- మూడు నెలల నుంచి జీతాలు అందక తీవ్ర అవస్థలు
- ఏప్రిల్ 12 నుంచి శాంతియుత నిరసనలు,
- స్పందించక పోతే ఏప్రిల్ 28 నుంచి నిరవధిక సమ్మె



నవతెలంగాణ-జగదేవపూర్

పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని పంచాయతి కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు వేణు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జూనియర్ కార్యదర్శి ఉద్యోగుల ప్రొబేషన్ పీరియడ్ నాలుగు సంవత్సరాలు పూర్తి కాబోతున్నందున ఏప్రిల్ 12 నుంచి పే స్కేల్ కల్పించి తమను రెగ్యులర్ చేయాలనీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని ప్రభుత్వం చేస్తున్న పల్లె ప్రగతి అన్ని విడతలు విజయవంతం చేశామని తెలిపారు. గ్రామ సర్పంచ్‌ల సహకారంతో గ్రామాలలో ఏర్పాటైన డంపింగ్ షెడ్, విలేజి పార్క్, గ్రామ నర్సరీ, హరిత హారం, బృహత్ పల్లె ప్రకృతి వనం, 42 రకాల రికార్డ్‌ల మెయింటెనెన్స్, మిషన్ భగీరథ నీటి సరఫరా, వీధి దీపాలు, రోడ్లు, మురికి కాలువలు, సర్వేలు,ఉపాధి హామీ, పెన్షన్ పంపిణి, కరోనా మహమ్మారి సమయంలో ఉపాధి హామీ పని, కరోనా సమయంలో గ్రామాలలో ప్రబలకుండా చూడటం, జనన , మరణ ధ్రువ పత్రాలు ఇంకా చాల రకాల పనులు చేస్తూ తమ విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. 2018 లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ఎగ్జామ్ ద్వారా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్, డిగ్రీ అర్హతతో నెగటివ్ మార్కింగ్‌తో, మూడు సంవత్సరాల ప్రొబేషన్‌తో, లక్షల మంది రాసిన పరీక్ష ద్వారా రాష్ట్రంలో 9000 మంది ఎంపిక కావడం జరిగిందన్నారు. సాధారణంగా ఏ ఉద్యోగికైనా 2 సంవత్సరాల ప్రొబేషన్ ఉంటుంది కానీ గత సంవత్సరం ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశాలలో మూడు సంవత్సరాల ప్రొబేషన్‌ను నాలుగు సంవత్సరాలు పొడిగించడం జరిగిందన్నారు. ఏప్రిల్ 12, 2023 తో ఈ గడువు ముగుస్తున్నందున రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామన్నారు. అనేక సార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఏప్రిల్ 12 నుంచి ఏప్రిల్ 27 వరకు శాంతియుతంగా నిరసనలు తెలియజేసి రాష్ట్రంలో ఉన్న కార్యదర్శులు ఏప్రిల్ 28 నుంచి పంచాయతీ రాజ్ కమిషనర్‌కు, మంత్రులకు, కలెక్టర్‌లకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెలోకి ఎళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సంఘం జనరల్ సెక్రటరీ సత్యం, మమత, నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ములుగు

తెలంగాణ రాష్ట్రం లో జూనియర్ కార్యదర్శి ఉద్యోగుల ప్రొబేషన్ పీరియడ్ నాలుగు సంవత్సరాలు పూర్తి కాబోతున్నందున ఏప్రిల్ 12 నుంచి పే స్కేల్ కల్పించి తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని ములుగు మండల కార్యదర్శులు కోరుతున్నారు . గ్రామాల అభివృద్ధి లో కీలక భూమిక వహిస్తు ప్రభుత్వం చేస్తున్న పల్లె ప్రగతి అన్ని విడతలు విజయవంతం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల జూనియర్ కార్యదర్శుల అధ్యక్షుడు యం. సతీష్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎస్ .బాల చంద్రం , మహిళా అధ్యక్షురాలు యం.మాధురి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పేదలకు,వృద్ధులకు వరం

- ఏఎంసి చైర్మన్ దోమల కొమురయ్య







నవతెలంగాణ-తొగుట

కంటి వెలుగు శిబిరం పేదలకు, వృద్ధులకు ఎంతో ఉపయోగ పడుతుందని ఏఎంసి చైర్మన్ దోమల కొమురయ్య అన్నారు. సోమవారం మండలంలోని కాన్గల్ గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశానికే తలమానికమన్నారు. ఇప్పటి వరకు 957 మందికి కంటి పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. ఇందులో 207 మందికి ఇప్పటి వరకు కళ్లద్దాలు అందించినట్లు పేర్కొన్నారు. 165 మందికి కళ్లద్దాలు రావాల్సి ఉందన్నారు. 66 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించినట్లు చెప్పారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

నవతెలంగాణ-మెదక్ డెస్క్

పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామ గ్రామాన కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరమని డీసీసీబీ జిల్లా డైరెక్టర్ వెంకటయ్య అన్నారు. సోమవారం అక్బర్ పేట భూంపల్లి మండలం భూంపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య పరిశీలించి మెడికల్ సిబ్బందికి గల వసతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు అందరు ఈ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెంకటయ్యతో పాటు ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్ వార్డు సభ్యులు దోమకొండ నర్సింలు బొల్లు స్వామి పంజా సత్తవ్వ గ్రామ కమిటీ అధ్యక్షుడు అయితం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం నంగునూరు మండలం అప్పలాయ చెరువు గ్రామంలో సర్పంచ్ గట్టు మల్లవ్వ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రాగుల సారయ్య, సోసైటి చైర్మన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధురి, ఉప సర్పంచ్ సాయి రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్స్, అంగన్వాడీలు, వార్డ్ మెంబర్లు, సీఏ, గ్రామ బీఆర్ఎస్ నాయకులు గట్టు శ్రీనివాస్, మహేష్, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

- జిల్లా అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి



నవతెలంగాణ-మెదక్ డెస్క్

విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని జిల్లా అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి సంయుక్త పిలుపు మేరకు జిల్లా ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న అలసత్వాన్ని తప్పుబట్టారు. తద్వార తాము మనోవేదనకు గురౌతున్నామన్నారు. కావున తమ న్యాయమైన డిమాండ్లను, కోరికలను వెంటనే నెరవేర్చాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అడిషనల్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర బాధ్యులు జి.మోహన్ రెడ్డి ఆర్ .రాజిరెడ్డి, మహంకాళి, రాములు, భూంరెడ్డి, గాల్‌రెడ్డి, బాలేశం, రవీందర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, రాజ గోపాలరావు, జలీల్, లక్ష్మయ్య, బలరాం, శ్రీధర్, సత్యం తదితర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇస్తూ వడ్డీ లేని రుణాలను మంజూరు చేసినందుకు సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తన్నీరు రేణుకా శ్రీనివాస్, ఎంపీటీసీ మమతా యాదగిరి, వార్డ్ సభ్యులు సృజనా సంపత్ యాదవ్, గ్రామ టిఆర్ఎస్ నాయకులు నారాయణ ,రాములు, కనకయ్య, రామ్ రెడ్డి, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన మాజీ ఎంపీపీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు ముమ్మరంగా పూర్తి చేయాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ వారంలోనే మంత్రి తన్నీరు హరీశ్‌రావుచే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కోరారు. ఆయనతో పాటు రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, తహశీల్దార్ దిలీప్ నాయక్,ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్,సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శిస్తే సహించేది లేదు

నవతెలంగాణ-గజ్వేల్



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదని వర్గల్ మండలం నాచారం డైరెక్టర్ మామిడి నరేష్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు బండి సంజీవ్ కుమార్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. బీజేపీకి పుట్టగతులు ఉండవన్నారు. మూడోసారి కూడా అధికారంలోకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వస్తుందని ఆయన చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు.

సీఎం కేసీఆర్ కృషితో గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి

- 12వ వార్డు కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి కెసిఆర్ కృషితో గజ్వేల్ ప్రజ్ఞపూర్ మున్సిపల్ లోని 12 వ వార్డ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం వార్డులో సీసీ రోడ్లకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. సీసీ రోడ్డు పనులు నాణ్యతలో రాజీ పడకుండా తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ వార్డ్ అధ్యక్షులు, జమీల్,వార్డ్ ముఖ్య సలహాదారు నాగేందర్, హన్మంతు, కొల్లూర్ స్వామి, గులాం, పాష, నాగరాజు, మల్లేశం, చందు, బిక్షపతి, సంతోష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు రంజాన్ తోఫాలు అందించాలి

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

అర్హులైన నిరుపేద ముస్లింలకు ప్రభుత్వం రంజాన్ తోఫాలు అందించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాలకు తంజీమ్ టోకెన్లు అందించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వార్డులలో మున్సిపల్ కౌన్సిలర్లకు వార్డు ముస్లిం ప్రజలు ఎందరో పక్కాగా తెలుస్తుందని, కానీ తంజీమ్‌కు ఎలా తెలుస్తుందని అన్నారు. తంజీమ్ వెంటనే టోకెన్లు ఆపేసి, వార్డుల్లోని మున్సిపల్ కౌన్సిలర్ల చేత రంజాన్ తోఫాను అర్హులైన వారికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. పండుగ సందర్భంగా పట్టణంలోని స్మశాన వాటికల్లో శుభ్రం చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, తంజీం అదేమీ పట్టించుకోకుండా టోకెన్లు పంపిణీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఇకనైనా స్పందించి సిద్దిపేటలోని ముస్లిం స్మశాన వాటికలను వెంటనే శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట్ మైనార్టీ ఉపాధ్యక్షులు ఫయాజ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్, శంకర్ , రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం సీఎం కృషి

- ఎంపీపీ సాయిలు, డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య



నవతెలంగాణ-మెదక్ డెస్క్

పేద ప్రజల సంక్షేమంతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ సాయిలు, డీసీసీబీ డిసిసిబి డైరెక్టర్ వెంకటయ్య అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతగానో మేలు చేకూరుతుందని తెలిపారు. మండలం పెద్ద చెప్యాల గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంపీపీ సాయిలు, డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్యలు సోమవారం అందజేశారు. నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి, బాబు, వెంకటయ్య పలువురు పాల్గొన్నారు.

ఎర్రవల్లి పాలకవర్గాన్ని అభినందించిన మంత్రి



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని సీఎం దత్తత గ్రామమైన ఎర్రవల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు మంత్రి తన్నీరు హరీశ్‌రావును సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి గ్రామానికి జాతీయ అవార్డు రావడంతో మంత్రి హరీశ్‌రావుతో పాటు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎర్రవల్లి అభివృద్ధి పనుల విషయమై మంత్రిని అడగగా త్వరలో నిధులు కేటాయిస్తామని గ్రామ సర్పంచ్‌కు హామీనిచ్చారు. జాతీయస్థాయిలో అవార్డు పొందడం పట్ల ఎర్రవల్లి గ్రామ సర్పంచ్, పాలకవర్గం సభ్యులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కనకయ్య, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యా వికాస్ రెడ్డి, వార్డు సభ్యులు శేఖర్, నవీన్ రెడ్డి, యాదగిరి, మల్లేశం, పరుశురాం, నవీన్ తదితరులున్నారు.

బహుజన రాజ్యాధికారంగా ముందుకు సాగాలి

- సామాజిక తెలంగాణా పొలిటికల్ ఫ్రంట్ కన్వినర్ బొంగు ప్రసాద్ గౌడ్



నవతెలంగాణ-మెదక్ డెస్క్

బహుజన రాజ్యాధికారంగా ముందుకు సాగాలని సామాజిక తెలంగాణా పొలిటికల్ ఫ్రంట్ కన్వినర్ బొంగు ప్రసాద్ గౌడ్ అన్నారు. ఈ నెల11వ తేదీన హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే సామాజిక తెలంగాణా పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భావ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిభాపూలే జయంతి రోజున అనేక పార్టీలు, అనేక సంఘాల కలయికతో ఏర్పడబోయే ఫ్రంట్ సామాజిక న్యాయం, సబ్బండ వర్గాల అభివృద్ధి, ముఖ్యంగా బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ఆవిర్భావ సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి మధు భూంపల్లి, గజ్వేల్ ఇంచార్జి ప్రసాద్, నాయకులు ఆంజనేయులు, భాను, భైరి నందు, సంతు, గణేష్, రాఖి, మహిపాల్, రావణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బాలనర్సయ్య



నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాలనర్సయ్య, చేర్యాల పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ పట్టణ కార్యవర్గ సమావేశం సోమవారం పట్టణ కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని తెలిపారు. సమావేశంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పచ్చిమడ్ల సిద్దిరాములు గౌడ్, సహాయ కార్యదర్శి బుర గోని తిరుపతి గౌడ్, అధికార ప్రతినిధి మంచాల కొండయ్య, పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు పచ్చిమడ్ల మానస, యూత్ అధ్యక్షుడు యాట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లోని కొత్త చెరువులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం సిద్దిపేట అదనపు కలెక్టర్‌కు సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. శిఖం భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అయినా మున్సిపల్, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై చట్టపైన చర్యలు తీసుకొని శిఖం భూములను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, యెడల వనేష్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, సీపీఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు జావా పంపిణీ



నవతెలంగాణ-మెదక్ డెస్క్

మండల పరిధిలోని ఖమ్మంపల్లి పాఠశాలలో సేవ్ సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావ మాజీ సర్పంచ్ యాదగిరి దంపతుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిలో చదివే బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఒంటి పూట బడి ఉండడం వలన ఉదయం త్వరగా బడికి తిని తినక వస్తారని ఉద్దేశంతో వాళ్లకు పౌష్టికాహారం అందజేద్దామనే మంచి ఆశయముతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ అంబలి పాఠశాల ముగిసే వరకు పంపిణీ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే జ్యోతి , ఉపాధ్యాయులు కే దేవయ్య మహారాజ్, జి రవి మహారాజ్, పి పద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం

నవతెలంగాణ- సిద్దిపేట



దళితుల అభ్యున్నతి కోసం సిఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్ మాదిగ అన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దళితుల అభివృద్ధి కోసం దళిత బంధు పథకం ప్రవేశపెట్టి , దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ 10 లక్షల ఇచ్చి కుటుంబానికి పెద్దదిక్కుగా నిలవడం జరిగిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 1100 యూనిట్లు కేటాయించినందుకు సిద్దిపేట జిల్లా పక్షాన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్ మాదిగ, సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ఎల్లం మాదిగ, నాయకులు దేవలపల్లి రాజేందర్ మాదిగ , కట్కూరి పరుశరాములు, లక్ష్మణ్ మాదిగ, రాజు , బబ్బురి కనకయ్య, దుర్గయ్య, దశరథం పాల్గొన్నారు.

కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాలు

నవతెలంగాణ - సిద్దిపేట



జిల్లా కేంద్రంలో కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు ఉచిత అంబలి కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద , ముస్తాబాద్ చౌరస్తా దగ్గర, నంగునూరు మండల కేంద్రంలో, చిన్నకోడూరు మండల కేంద్రం , పెద్దకోడూరులలో అంబలి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ట్రస్టు సభ్యులు మహమ్మద్ ఖదీర్ అలీ, కొండ రాజ్ కుమార్, ఇజాజ్ పటేల్, నల్ల ఈశ్వర్, మహమ్మద్ యూసుఫ్ , సురేందర్ గౌడ్, జవన రమేష్, కిరణ్ గౌడ్ , గౌరీ శంకర్, గిరి, చిరు, వేణు, వెంకట్ , అభి, ఎండి బాబా, పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-మర్కుక్ : సీఎం సహాయ నిధి పేద ప్రజలకు ఎంతో తోడ్పాటును అందిస్తుందని సర్పం చుల ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు, వరదరాజ్ పూర్ సర్పంచ్ అప్పాల ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వరదరాజ్‌పూర్ గ్రామానికి చెందిన యాట మహేష్‌కు రూ.లక్ష,20 వేలు, బి.శ్రీకాంత్‌కు రూ.90 వేలు, బి.కృష్ణకు రూ. లక్ష సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బి.అశోక్, నల్లా నగేష్, తదితరులున్నారు.

లక్ష్మీనరసింహ స్వామి హుండి ఆదాయం లెక్కింపు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండి లెక్కింపు సోమవారం శ్రీ శరభేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహ ణ అధికారి రవి కుమార్ అద్వర్యంలో చేపట్టారు.69 రోజులకు సుమారు రూ.5,11,590 ఆదాయం ఆలయానికి సమకూరినట్టు రవి కుమార్ తెలిపారు. సర్పంచ్ ద్యావనపల్లి మంజుల, ఆలయ చైర్మన్ బండారి రాములు, సభ్యులు, ఎంపీడీఓ రాము, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేరోజు రెండు ప్రవేశ పరీక్షలు

- తలలు పట్టుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-కోహెడ

టీఎస్‌డబ్ల్యూఆర్, టీటీడబ్ల్యూఆర్ 6 నుండి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలు, తెలంగాణ మోడల్ పాఠశాల కళాశాలలో 6 నుంచి పదోవ తరగతి వరకు గల సీట్లకుగాను ఒకే రోజు ఆరవతరగతికి ప్రవేశ పరీక్ష ఉండడంతో ఏది రాయాలో అర్ధంకాక తల్లిదండ్రులు, విద్యార్థులు తల పట్టుకుంటున్నారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచే ఏ పరీక్ష ఏఏ తేదీలలో నిర్వహించాలనే షెడ్యూల్ లేకుండా నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోటోలో కనిపిస్తున్న బుడతడు మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన జనగంటి వర్షిత్ (10) 6వ తరగతికి ఎంట్రెన్స్ ఎగ్జామ్ వ్రాసేందుకు బోర్డుకు ఫీజు చెల్లించి ధరఖాస్తు చేసుకున్నాడు. ఈ నెల 16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష అలాగే టీఎస్‌డబ్ల్యూఆర్ ప్రవేశ పరీక్ష రెండు ఒకే రోజు ఉండడంతో ఏ పరీక్షకు హాజరు కావాలో తెలియక తికమకపడుతున్నాడు. వర్షిత్ ఒక్కడు మాత్రమే కాకుండా ఇలాంటి వారు ఎంతో మంది విద్యార్థులు నష్ట పోయే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ నెల 16న ఏదో ఒక పరీక్ష నిర్వహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



మహిళోద్ధారకుడు 'జ్యోతిరావ్ ఫులే'..

- విద్య విశ్వీకరణను సమర్ధించిన మొదటి సంస్కర్త
- మహిళా విద్యకు మార్గదర్శకులు
- నేడు జ్యోతిరావ్ ఫులే జయంతి

అంటరానితనం,కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధారణకు కృషి చేసిన గొప్ప సంస్కర్త జ్యోతిరావ్ ఫులే. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడి దిగువ కులాల ప్రజలు సమాన హక్కులను పొందడానికి అన్ని మతాలకు ప్రాదాన్యత కల్పిస్తూ సత్యశోధక్ సమాజ్ ఏర్పాటు చేశాడు. ఫులే బాలికల చదువుకోసం పాఠశాలను ప్రారంభించి వితంతువుల ఒక గృహాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు చదువుతోనే విజ్ఞానవంతులవుతారని గ్రహించి విద్య విశ్వీకరణను సమర్ధించిన మొదటి సంస్కర్త ఫులే. ఒక గోప్ప సంఘ సంస్కర్తగా,మహిళల చదువుకు మార్గధర్శకులుగా, అణగారిన వర్గాల ప్రజలు తమ హక్కులు పొందడానికి సామాజిక సంస్కరణోద్యమంలో ప్రసిద్ధిగాంచారు జ్యోతిరావ్ ఫులే. నేడు జ్యోతిరావ్ ఫులే జయంతి సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం...

నవతెలంగాణ-బెజ్జంకి

సామాజిక తత్వవేత్త, ఉద్యమకారులు, సంఘ సేవకుడైన జ్యోతిరావ్ ఫులే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మాలి కులానికి చెందిన కుటుంబంలో 1827ఏప్రిల్ 11న చిమ్నాభాయ్ గోవిందరావ్ ఫులే దటపతులకు జన్మించాడు. చిన్నతనంలోనే తల్లి మరణించడంతో తండ్రికి వ్యవసాయంలో సాయంగా పనిచేశాడు.ఫులేకు పుస్తకం పఠనంపై ఉన్న ఆసక్తిని గమనించిన ఒక ముస్లిం ఉపాధ్యాయురాలు తన ఇంటి ప్రక్కన ఉన్న క్రైస్తవ పెద్దమనిషితో మాట్లాడి ఫులే తండ్రిని ఒప్పించి విద్యభ్యాసం కొనసాగేల చేసింది.పూణేలోని స్కాటిష్ మిషన్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న క్రమంలో సదాశివ భిల్లాల్ గోవింద్ అనే బ్రాహ్మణునితో పరిచయం జీవితకాల స్నేహంగా మారింది.మానవహక్కులు,ప్రాథమిక సూత్రాలను చిన్నప్పుడే జ్ఞానాన్ని సంపాదించాడు ఫులే.శివాజీ,జార్జ్ వాషింగ్టన్‌ల జీవితచరిత్రలు ప్రభావితం చేయడం వల్ల దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవాటయ్యాయి. అమెరికా స్వాతంత్ర్య పోరాటం ప్రభావితం చేయడంతో మానవత్వపు విలువలైన స్వేచ్ఛ, సమానత్వం గూర్చి నిక్షిప్తంగా ఆలోచింపజేసింది. తన 13వ ఏటా సావిత్రితో బాల్య వివాహం జరిగింది. తన బ్రాహ్మణ స్నేహితుడి వివాహంలో ఫులే కుల వివక్షకు గురయ్యాడు.ఆ క్షణం నుండా కులవివక్షపై పోరాడడం మొదలుపెట్టాడు. సమాజంలో బ్రాహ్మణుల అధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ జ్ఞాన సంపదను అందరికీ అవకాశం ఇవ్వకపోవడంపై అభ్యంతరం తెలిపాడు. సమాజంలో సగభాగమున్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజాభివృద్ధి సాధించదని గ్రహించి తన బార్యను ఒప్పించి అణగారిన వర్గాల మహిళలకు చదువు కోసం పాఠశాలను ఏర్పాటుచేశాడు. క్రమక్రమంగా పాఠశాలకు ఆదరణ పేరగడంతో రెండు పాఠశాలలు స్థాపించి అణగారిన వర్గాల బాలికలకు విద్యనందించాడు. బ్రిటిష్ ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేయడాన్ని విమర్శించాడు.స్త్రీ పురుషుల మధ్య లింగవివక్షను విమర్శించాడు.స్వేచ్ఛ, ఐక్యమత్యంతో కూడిన సమసమాజాన్ని అకాంక్షించాడు. అనాడు ముసలివారికిచ్చి బాల్య వివాహలు సర్వసాధారణంగా జరగడం వల్ల చిన్నతనంలోనే వితంతువులయ్యేవారు.వీరు మళ్లీ వివాహం చేసుకోవడాన్ని సమాజం అంగీకరించేదికాదు. వితంతు పునర్వివాహాల గూర్చి ఫులే ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారు. విగ్రహారాధనను ఖండించాడు. సహపంక్తి బోజనానికి సంసిద్ధత వ్యక్తం చేశాడు.దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం,రక్తనాళాలాంటివారని చాటి చేప్పారు.సామాజిక పజాస్వామ్యం సాధించటం భాతర దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్నిచ్చిన ఫూలే తన గురువని డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ప్రకటించాడు. సమాజంలో అణగారిన వర్గాల ప్రజలు,మహిళల కోసం చేసిన కృషికి 'మహాత్మ'బిరుదు వరించింది.

> అణగారిన జీవీతాల్లో అక్షరధారి...
> పోద్దెపొడిచేను చదువుల జెండగామారి ..
> ఈ దేశపు మొదటి పంతులమ్మగాజేరి..
> మన జీవితాల్లో నింపిందో వెలుగులదారి..
> మరోవద్దురా సమాజమా మహనీయులను..
> ఫూలే సావిత్రీ బాయ్ త్యాగాలను...
>
> -రాంబాబు యాసారా గేయ రచయిత

జ్యోతిరావ్ ఫులే జయంతి పండుగ రోజు



అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులు జ్యోతిరావు ఫులే, సావిత్రిబాయ్ ఫులే దంపతులు.కుల వివక్ష, బాల్య వివాహలనూ నిర్మూలించి వితంతువులకు పునర్వి వివాహలు జరిపించేల జ్యోతిరావ్ ఫులే కృషి చేశాడు. సమాజంలో సగభాగమున్న మహిళల చదువు తోనే సమాజాభివృద్ధి సాదించ వచ్చునని సావిత్రిబాయ్ ఫులే విద్యతో విజ్ఞానాన్ని అందించారు.నేడు మండల కేంద్రంలో నిర్వహించనున్న జ్యోతిరావ్ ఫులే జయంతిని పండుగ రోజుగా గ్రహించి విజయవంతం చేయాలి.

-పెద్దోల్ల శ్రీనివాస్ యాదవ్,
జయంతోత్సవ కమిటీ చైర్మన్,బెజ్జంకి.

అంబేద్కర్ జయంతికి లక్ష్మీ ఫౌండేషన్ రూ 5 వేలు విరాళం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రజ్ఞాపూర్‌లో జరిగే అంబేద్కర్ జయంతి ర్యాలీకి తనవంతుగా రూ.5 వేలు విరాళాలు ఇస్తున్నట్టు లక్ష్మీ పౌండేషన్ వ్యవస్థాపకులు, మూడో వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య తెలిపారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సామాజిక సేవలో తమ వంతు బాధ్యతగా తోటి వారికి సహాయం చేయడమే లక్ష్మీ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. ఇకముందు లక్ష్మీ ఫౌండేషన్ సేవలు సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్‌లో విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, నాయకులు అంబేద్కర్ జయంతి ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడవ వార్డు అధ్యక్షులు శ్రీరామ్ మల్లేశం, నవీన్,పాల్గొన్నారు.

మాయ మాటలకు మోసపోవద్దు

నవతెలంగాణ-నంగునూరు

విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా కొత్త వ్యక్తులు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని రాజగోపాల్ పేట ఎస్సై ఎల్.రాజు గౌడ్ సూచించారు. సోమవారం నంగునూరు మండల పరిధిలోని రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పోక్సో, బాల్య వివాహల చట్టాల గురించి వివరించారు.సైబర్ క్రైమ్, షీ టీమ్స్, ఆన్లైన్ మోసాలు, బాల్య వివాహలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, తదితర అంశాల గురించి చట్టాల గురించి విద్యార్థినిలకు వివరించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపకులు, ఏఎస్సై నితిన్ పవర్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కూడవెల్లి ఆలయంలో రుద్రాభిషేకం

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అక్బరుపేట భూంపల్లి మండల కేంద్రంలోని కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు సాంకేత శర్మ స్వామివారికి రుద్రాభిషేకం, అన్నపూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ పూజారి చంద్రం, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదము వితరణ చేశారు.

దృష్టిలోప నివారణకు కంటివెలుగు

జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి

నవ తెలంగాణ-రాయపోల్

రాష్ట్ర ప్రజల దృష్టిలోపం నివారించడానికే కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించడం జరిగిందని జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి అన్నారు. సోమవారం రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో రెండో విడత పల్లె వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన కంటి చూపు ఉండాలనే ఉద్దేశంతో ఉచితంగా గ్రామాలలో శిబిరాలు నిర్వహించి కంటి వెలుగు కార్యక్రమంలో కళ్లద్దాలు, మందులు అందించడం జరుగుతుందని, సమస్య ఎక్కువ ఉన్నవారిని జిల్లా ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీ వెంకటయ్య, బిఆర్ఎస్ తీగుల్ల స్వామి, జనార్ధన్, వైద్య బృందం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాకలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. పురపాలిక కేంద్రంలోని జిహెచ్ఎస్ (కేసీఆర్ స్కూల్),జెడ్పిహెచ్ఎస్ (గర్ల్స్), పురపాలక పరిధిలోని లచ్చపేట వార్డులో గల జడ్పీహెచ్ఎస్, టిఎస్ మోడల్ స్కూల్లలో ఏర్పాటు చేసిన 4 పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన జీవశాస్త్రం,భౌతిక రసాయన శాస్త్రం పరీక్షలకు 774 మంది విద్యార్థులు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారయ్యారని తెలిపారు. జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి పరీక్ష కేంద్రాల్ని సందర్శించినట్లు ఎంఈఓ తెలిపారు.

జాతీయస్థాయి బీచ్ టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైన యువకులు



నవతెలంగాణ-గజ్వేల్ : గోవాలో 13వ తేది నుంచి నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి బీచ్ టార్గెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో గజ్వేల్ పట్టణం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన జి .సందీప్, భాను ప్రసాద్ ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ సమీర్, ప్రధాన కార్యదర్శి సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఈ పోటీలు జరుగుతున్నాయని వారు చెప్పారు. గజ్వేల్ నుంచి యువకులు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా సూర్య వర్మ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట : కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సూర్య వర్మ పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సూర్య వర్మను పూలమాలలు, శాలువాలతో సత్కరించి, కేకులు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామ చంద్రం, ఖలీముద్దీన్, షాబుద్దీన్, శ్రీనివాస్, సీతా బాలు, తదితరులు పాల్గొన్నారు.

రామరాజుకు భద్రాచలం నుంచి ఆహ్వానం



నవతెలంగాణ-గజ్వేల్ : భద్రాచల దేవస్థానం వారు గజ్వేల్‌లోని శ్రీరా మకోటి భక్త సమాజం సేవను గుర్తించి ఆయనను రెండవసారి అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమ వారం భద్రాచలం దేవాలయం నుంచి ఆయనకు సమాచారం ఇచ్చారు. సీతారాముల కల్యాణం అనంతరం తలంబ్రాల ను రామకోటి సంస్థకు ఇవ్వనున్నట్లు భద్రాచలం దేవస్థాన ఏఈవో శ్రవణ్ కుమార్ ఆహ్వానం పంపినట్లు అధ్యక్షుడు రామకోటి రామరాజు తెలిపారు.